భౌ.. భౌ.. లేదిక భయం

- శునకాలకు ఆపరేషన్‌లు చేయించేందుకు సిద్ధం
- ఊరట కలుగుతుందంటున్న మున్సిపల్ యంత్రాంగం


శునకాల కోసం ఏర్పాటు చేస్తున్న షెడ్డుల నమూనాలు

బాపట్ల: ఏ వీధిలోకి వెళితే ఎక్కడ పిక్కపట్టుకుంటుందనే భయం.. బైక్ హారన్ మోగిందంటే ఎటు నుంచి వస్తుందోననే గుండె దడ.. చీకటి పడిందంటే ఏ సందులో నుంచి వస్తుందోననే భయం.. చిన్న పిల్లలు ఏమైనా తినుబండారాలతో కనిపిస్తే ఎక్కడ లాక్కుని వెళతాయోననే ఆందోళనతో బాపట్ల పట్టణ ప్రజలు ఆవేదనలో ఉన్నారు. ప్రస్తుతం బాపట్లలో నెలకు దాదాపు 70 మందికి పైగా కుక్క కాటుకు గురవుతున్నారు. దీంతో ప్రజలు మరింత భయాందోళన చెందుతున్నారు. ఇక శునకాల భయానికి చెక్ పెట్టేందుకు మున్సిపల్ యంత్రాంగం సిద్ధమైంది. శునకాల నియంత్రణతోపాటు, వాటిని షెడ్డులో ఉంచేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. రేబిస్ వ్యాక్సిన్ సిద్ధం చేయటంతోపాటు కుక్కల ఉత్పత్తికి బ్రేక్‌లు వేసేందుకు ముందుకు అడుగు వేశారు.

ప్రత్యేక షెడ్డు ఏర్పాటు

మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి బాధ్యతలు తీసుకున్న వెంటనే కుక్కల సమస్యను పరిష్కరించేందుకు సిద్ధమయ్యారు. తాను పని చేసిన ప్రొద్దుటూరు మున్సిపాల్టీలో చేపట్టిన విధంగా బాపట్లలో కూడా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు ఏర్పాట్లు చేయిస్తున్నారు. ఇందుకు ఉప్పరపాలెంలోని శ్మశానవాటిక వద్ద ప్రత్యేకంగా ఒక షెడ్డు ఏర్పాటు చేసి యంత్రాలు సమకూర్చే పనిలో ఉన్నారు.

బాపట్లలో 6 వేల కుక్కలు

బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో కుక్కల ఉత్పత్తిని అరికట్టేందుకు మంగళగిరి, తెనాలిలో మాత్రమే మున్సిపాల్టీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది.


తెనాలి మున్సిపాల్టీలో కుక్కలకు ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

కుక్కలను తీసుకుని వెళ్లి రెండు రోజుల పాటు అక్కడే ఉంచి ఆపరేషన్ చేయిస్తారు. మళ్లీ మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వాటిని ఎక్కడైతే పట్టుకున్నారో అక్కడే వదిలి పెట్టే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు బాపట్లలో మొత్తంగా ఆరు వేల కుక్కల వరకు ఉంటాయనే అంచనాకు వచ్చారు. రోజుకు 4 నుంచి 5 కుక్కలకు ఆపరేషన్ చేయించేందుకు అనుగుణంగా షెడ్డు, వైద్యులను అందుబాటులో ఉంచే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టారు.

ప్రజలు అధైర్య పడవద్దు



బాపట్లలో కుక్కల సమస్య ఎక్కువగా ఉందనే ఫిర్యాదులు వచ్చాయి. కుక్కలను చంపటం, అడవుల్లో వదిలి పెట్టడం నేరం. వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించటం ద్వారా ఉత్పత్తిని తగ్గించటానికి ప్రయత్నం చేస్తున్నాం. బాపట్లలో కుక్కలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. మరోవైపు కోతులను తరిమికొట్టేందుకు కొండముచ్చును కూడా తీసుకువచ్చాం. ప్రజలు అధైర్య పడకుండా ఉండాలి.

–జి.రఘునాథరెడ్డి, కమిషనర్

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

రేపల్లె రూరల్: రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను కాపాడే దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్ సూచించారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కంపోస్టింగ్ ఆర్గానిక్ వేస్ట్ అంశంపై పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంటితో పాటు పరిసరాలు, గ్రామాలలో సైతం స్వచ్ఛత కాపాడే విధంగా కృషి చేయాలన్నారు. తడి చెత్త – పొడి చెత్త వేరు చేసే విధానం తెలుసుకోవాలన్నారు. ఆయా వ్యర్థ పదార్థాలను వేరు చేసి డబ్బాలలో నిల్వ ఉంచి కంపోస్ట్ తయారు చేసుకోవాలన్నారు. ఈ కంపోస్ట్ మొక్కల పెంపకానికి గానీ ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు.


వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఈ సందర్భంగా విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించి కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ వలివేటి వెంకట రవీంద్ర, కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.దాసు, అధ్యాపకులు బి.కోటేశ్వరరావు, కె.బాల గురవయ్య, సీహెచ్ చిట్టి బాబు, కె.ప్రసన్న కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

23 నుంచి సూరేపల్లిలో శివపార్వతుల కల్యాణోత్సవాలు


కేదారేశ్వర వాయులింగ ఆలయంలో తీర్చిదిద్దుతున్న ప్రభ

సూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో కొలువైన కేదారేశ్వర వాయులింగ ఆలయంలో శివపార్వతుల కల్యాణం, తిరునాళ్ల కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రభను, గూడు బళ్లను అందంగా తీర్చిదిద్దారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి 7 నుంచి 12 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు గురువారం తెలిపారు. 26వ తేదీ


ప్రత్యేకంగా అలంకరించిన గూడు బళ్లు

బుధవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు స్వామి వారికి భక్తులచే స్వయంగా అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12:30 గంటలకు స్వామి వారి ప్రభ మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, కోలాటం, కాళీమాత వేషధారణలు, బుట్ట బొమ్మలు, కేరళ తిలకం, కర్నాటక వేదనాదం, కొమ్ము నాట్యం, వీరభద్ర నృత్యాలు, శివ శక్తుల తాండవాలతో స్వామి వారి ఊరేగింపు గ్రామ పురవీధులలో జరుగుతుందని తెలిపారు. భక్తులకు శివరాత్రి పర్వదినాన ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మెరుగైన పోషణతోనే ఆరోగ్యం మెరుగు

కొల్లూరు : శరీరానికి అవసరమైన పోషక పదార్థాలు మెరుగుగా అందినప్పుడే చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మెరుగు పడుతుందని అమృతలూరు ఐసీడీఎస్ సీడీపీఓ జి.విజయలక్ష్మి అన్నారు. గురువారం కొల్లూరు బాలికోన్నత పాఠశాలలో కొల్లూరు, అనంతవరం సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ-పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషకాహారం పంపిణీ అనంతరం గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా సరైన అవగాహన కల్పించే పద్ధతులను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీ స్కూల్ చిన్నారులకు ఆ వయస్సులోనే 85 శాతం మానసిక అభివృద్ధి జరుగుతుందని, ఆ సమయంలో వారికి మంచి నడవడికను అలవర్చే విధంగా అంగన్‌వాడీలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. చిన్నారులకు ఆటలతో కూడిన విద్యా బోధనపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రీ స్కూల్ విద్యపై ఎక్కువ దృష్టి సారించడం, పోషకాహారం సక్రమంగా అందించడం ద్వారా చిన్నారులకు శారీరక, మానసిక తదితర అంశాలలో మంచి అభివృద్ధి ఉంటుందన్న విషయాన్ని అంగన్‌వాడీలు గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ బి.విజయరాణి, డీఈఓ సునీత, సూపర్‌వైజర్ టి.విజయలక్ష్మి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న ఏసీడీపీఓ, డీఈఓ, సూపర్‌వైజర్‌లు

'పోషణ్ భీ-పఢాయి భీ'పై శిక్షణ

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ హైస్కూలు, త్రిబుల్ ఎస్ హైస్కూలులో రేపల్లె పట్టణ, మండలంలోని అంగన్‌వాడీలకు పోషణ్ భీ-పఢాయి భీ అంశంపై సీడీపీవో సుచిత్ర గురువారం శిక్షణ నిచ్చారు. గర్భిణులు, బాలింతలు, శిశువులకు అంగన్‌వాడీలు నిర్వహించాల్సిన విధివిధానాలు, అందించే సంపూర్ణ పోషకాహారంపై అవగాహన కల్పించారు. శిక్షణ తరగతులు 15వ తేదీ వరకు నిర్వహించబడతాయని, అంగన్‌వాడీలు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు నాంచారమ్మ, శివజ్యోతి, సునీత, నాగలక్ష్మి, మంజుల, వెంకటేశ్వరమ్మ, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన ఆలయంలో వేలిముద్రల సేకరణ

కొల్లూరు : ఆలయంలో చోటుచేసుకున్న చోరీ ఘటనలో నిందితుల ఆచూకీ తెలుసుకునేందుకు క్లూస్ టీం వేలిముద్రల సేకరణ ప్రక్రియ నిర్వహించారు. కొల్లూరు శివారు యాదవపాలెం గ్రామం వెలుపల ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడిన ఘటన విదితమే.. చోరీ ఘటనపై స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రక్రియను ప్రారంభించారు. గురువారం కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు, క్లూస్ టీం సభ్యులు ఆలయంలో చోరీ జరిగిన తీరుతెన్నులను పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు ఆలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వేలిముద్రలు సేకరించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు అధికారులతో సమీక్ష సమావేశం

అమర్తలూరు(వేమూరు) : బాల కోటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో 15వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి అశోక్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి, రేపల్లె డివిజనల్ పోలీసు అధికారి, వివిధ శాఖల అధికారులు హాజరు కావలెనాని ఆయన తెలిపారు. మహా శివరాత్రి తిరునాళ్లపై సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

నేడు గుత్తావారిపాలెంలో వేంకటేశ్వరుని కల్యాణం

పెదపులివర్రు(భట్టిప్రోలు): లోక కల్యాణార్థం భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామస్తుల ఆధ్వర్యంలో గుత్తావారిపాలెంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు జంపని వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మహోత్సవంలో అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

కారు ఢీకొని గాయాలు

తెనాలిరూరల్: కారు ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన తెనాలిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాండురంగపేటకు చెందిన ముక్కామల మధుబాబు స్కూటీపై వెళుతుండగా ఫ్లైఓవర్ వంతెనపై ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



కొల్లిపర: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.కోటేశ్వరరావు అన్నారు. బుధవారం తెల్లవారు జామున ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని వారి వద్ద ఎటువంటి పత్రాలు లేక పోవటంతో కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి



వేమూరు : ఓ యువకుడు వడ్రంగి ఉలితో మహిళపై దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని జంపని గ్రామానికి చెందిన వేల్పూరి భాగ్యలక్ష్మి భర్త నుంచి విడిపోయింది. అదే గ్రామానికి చెందిన యల్లమాటి ప్రభాకరరావుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. గురువారం తెనాలిలోని నటరాజ్ జూయలరీ షాపులో పని చేసేందుకు ఉదయం 9 గంటలకు జంపని గ్రామం నుంచి బయల్దేరి వెళుతుంది. తెనాలి నుంచి జంపని గ్రామానికి ప్రభాకరరావు వస్తున్నాడు. అదే సమయంలో పెట్రోలు బంకు సమీపంలో భాగ్యలక్ష్మిని అడ్డుకుని ఫోన్ ఎందుకు లిఫ్ట్ చేయడం లేదంటూ ఘర్షణ పడ్డాడు. చేతిలో ఉన్న వడ్రంగి ఉలితో మూడు చోట్ల పొడిచి పరారయ్యాడు. స్థానికులు 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు లక్ష్మి థియేటర్ సెంటర్ నుంచి బస్టాండ్ రోడ్డుకు దక్షిణం వైపు, ఉప్పూడి రోడ్డు, ఉప్పూడి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆ శాఖ టౌన్ ఏఈ ఎ.శివనాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లూరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు గురువారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెసర్లంక శివారు ప్రాంతంలోని కృష్ణా నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారంతో దాడులు నిర్వహించగా, రెండు ట్రాక్టర్లు నదిలో ఇసుక నింపుకొంటున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెండు వాహనాలను కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న బాలకోటేశ్వరస్వామి దేవాలయం



భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన కంచి కామాక్షి సమేత బాలకోటేశ్వరస్వామి దేవాలయం మహా శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతుంది. ఈ దేవాలయంలో రెండున్నర శతాబ్దాలకు పైగా వెల్లటూరు వంశీకులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 26వ తేదీన మహా శివరాత్రి సందర్భంగా స్వామి వార్లకు బిందితీర్థం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవాలయ అర్చకులు తెలిపారు. ఆ రోజు రైతులు పశు సంపదను తీసుకువచ్చి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. అద్దేపల్లి, భట్టిప్రోలులోని పురవీధులు శివ నామస్మరణతో మారుమోగుతాయి.

'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్'లో భాగస్వాములు కావాలి

ఇన్‌చార్జి డీఎల్‌పీఓ శ్రీనివాసన్

చెరుకుపల్లి: ఆంధ్రప్రదేశ్ పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి డీఎల్‌పీఓ కేజీపీ శ్రీనివాసన్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా మండలంలోని చెరుకుపల్లి, కనగాల గ్రామాలలోని ఘన వ్యర్థ పదార్థాల సంపద కేంద్రాలను శ్రీనివాసన్ గురువారం సందర్శించి మాట్లాడారు. గ్రామ పంచాయతీలో ఘన వ్యర్థ పదార్థాల సంపద కేంద్రాలను మరింత అభివృద్ధి పరచి సంపద సృష్టించి గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలని సర్పంచ్‌లు, కార్యదర్శులకు వివరించారు. మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు శుభ్ర పరచటం, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచటం, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలని డీఎల్‌పీఓ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఈవూరు విజయ్‌బాబు, తెనాలి వెంకటేశ్వర్లు, ఆయా గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన ఆయేషా గత నెల 31వ తేదీన చికెన్ తీసుకొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఇన్నాళ్లు గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

తెనాలిరూరల్: ఆర్థిక సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక రామలింగేశ్వరపేటకు చెందిన ముత్యాల ఇంద్రాణి (34) బుధవారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. ఇంద్రాణి భర్త శ్రీనివాసరావు డెకరేషన్ వ్యాపారం చేస్తుండగా వీరికి 15 ఏళ్ల కుమార్తె, 14 ఏళ్ల కుమారుడు ఉన్నారు. తెనాలి పురవేదిక వద్ద నారకొట్టు ఉండగా తాళ్లు, పట్టాలు వంటి విక్రయాలు జరుపుతుంటారు. అయితే ఆర్థిక లావాదేవీల కారణంగా ఇంద్రాణి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

జంక్ ఫుడ్‌పై అవగాహన



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సీఈఏ ఆధ్వర్యంలో పెదవడ్లపూడిలో జంక్‌ఫుడ్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎక్కువ రోజుల నిల్వచేసిన పదార్థాలను తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోతుందని వివరించారు. సీఈఏ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల కల్యాణం

చింతాయపాలెం(కర్లపాలెం): శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వాముల వార్షిక శాంతి కల్యాణం బుధవారం రాత్రి కనుల పండువగా జరిగింది. చింతాయపాలెం పంచాయతీ తూర్పుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల ఆలయం వద్ద అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల ఉత్సవ విగ్రహాలను ఉంచి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృత శ్రీచందన సుగంధ ద్రవ్య అభిషేకాలు, పుష్పార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజారులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్, జనసేన గుంటూరు జిల్లా సమన్వయకర్త వెంకటేశ్వరరావులు ఆలయం వద్ద పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ఆకర్షణగా నిలిచింది.


శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాములు

లక్ష్మణరావు గెలుపు తప్పనిసరి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె రూరల్: నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయల కోసం నిరంతరం పోరాడే లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపుకోసం మండలంలోని నిజాంపట్నం సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలోనూ అనేక సమస్యలపై అసెంబ్లీలో పోరాడిన లక్ష్మణరావు మరోమారు అసెంబ్లీలో సమస్యలపై గళం విప్పి మాట్లాడాలంటే లక్ష్మణరావు గెలుపు తప్పనిసరన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు చెన్ను ప్రహ్లాదుడు, కె.రమేష్, బి.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

ఎమ్మెల్సీగా లక్ష్మణరావును గెలిపించండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంగయ్య

బాపట్ల: కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నిజాయితీకి పట్టం కడదామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య ఓటర్లను కోరారు. గురువారం ఉదయం బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న లక్ష్మణరావుకు ఓటు వేయాలని ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే లక్ష్మణరావును శాసన మండలికి పంపించాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్క పట్టభద్రులైన ఓటర్లు గుర్తించాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, అంగన్‌వాడీ, పేద మధ్యతరగతి ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా లక్ష్మణరావు ప్రజావాణిని శాసనమండలిలో వినిపిస్తారన్నారు. సౌమ్యులు పేదల ఎమ్మెల్సీగా పేరుపొందిన కె.ఎస్. లక్ష్మణరావును శాసన మండలికి పంపాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని గంగయ్య పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు కొండయ్య మాట్లాడుతూ సేవా తత్పరులు పీడీఎఫ్ ఎమ్మెల్సీగా పోటీలో ఉన్న లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, లక్ష్మణ, రంగారెడ్డి, కళాధర్, అనిల్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంగయ్య

క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి సన్మానం

నగరం: క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎస్వీఆర్ఎం కళాశాల యాజమాన్యం అండగా ఉంటుందని కరస్పాండెంట్ వి.బుచ్చియ్యచౌదరి చెప్పారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రిషికేష్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడలలో కళాశాల విద్యార్థిని నాగిడి గాయత్రి పడవ పందెం (వాటర్‌స్పోర్ట్) విభాగంలో గోల్డ్ మెడల్ సాధించడంతో గురువారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చియ్యచౌదరి మాట్లాడుతూ గాయత్రి జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి కళాశాల కీర్తిని ఇనుమడింపజేసిందన్నారు. కళాశాల యాజమాన్యం తరపున రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. గాయత్రికి కళాశాల ఆర్‌టీఈఐ సొసైటీ ట్రెజరర్ గాజుల వెంకటేశ్వరావు రూ.10 వేలు అందజేశారు. అనంతరం గాయత్రిని సన్మానించారు. అదే విధంగా ఇంటర్‌లోని పేద విద్యార్థులకు రూ.80 వేల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థినిని సన్మానిస్తున్న యాజమాన్యం

సాయినాథుని మందిర ప్రతిష్టా వార్షికోత్సవం

బాపట్ల: పట్టణంలోని షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురువారం ఉదయం 5.30 గంటలకు అఖండ దీప స్థాపన కంచర్లపల్లి రామాంజనేయులు రాజ్యలక్ష్మీ దంపతులచే అఖండ దీప స్థాపన, అఖండ నామ సప్తాహం ప్రారంభించారు. శాసనసభ్యులు వేగేసన నరేంద్ర వర్మ పాల్గొని సాయినాథునికి పూజలు నిర్వహించారు. 29వ ప్రతిష్టా వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కుంకుమార్చన, లలిత సహస్ర నామ, సోమవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, మంగళవారం లక్ష తులసీ దళార్చన , బుధవారం కర్పూర హారతి, ప్రత్యేక అభిషేకం, మధ్యాహ్న హారతి, నారాయణ సేవ (అన్న సంతర్పణ) బాబా నగరోత్సవం జరుగునని బాపట్ల షిరిడీ సాయిబాబా సేవా సమితి సభ్యులు తెలియజేశారు.


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి

తెనాలిరూరల్: వాహనదారులు రహదారి భద్రత నిబంధనలు విధిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక ప్రాంతీయ రవాణా అధికారి కార్యాలయంలో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని, వాహన చోదకుల రక్షణ కోసమే నిబంధనలు అమలు చేస్తున్నామని చెప్పారు. నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా తమను తాము రక్షించుకోవచ్చన్నారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల బారిన పడిన బాధితులను గోల్డెన్ అవర్లో ఆస్పత్రి, ట్రామా కేర్ సెంటర్‌కు తరలించి తక్షణ వైద్య సహాయాన్ని అందించడం ద్వారా ప్రాణాలను రక్షించిన వారవుతారన్నారు. సరుకు రవాణా వాహనాల డ్రైవర్లు, లారీ ఓనర్లు పాల్గొన్నారు.